క్లుప్తంగా

కనీస వేతనాలు అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం జీవో 22 గెజిట్ విడుదల చేసి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ మల్లికార్జున్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వం వెంటనే జీవోను విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. 2022 సెప్టెంబర్‌లో చేసిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. నర్సరీ కార్మికులకు సీఎంపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అగ్రికల్చర్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. నాయకులు సిద్దెంకి సత్తన్న, చిన్నుబాయ్, శారద, అనిత, ప్రవీణ్, దర్మారావు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు పలువురి లబ్ధిదారులకు శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. వాంకిడి మండలం ఖమానా గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌కు రూ.30వేలు, ఆసిఫాబాద్, బురుగుడాకు చెందిన గురుమూర్తికి రూ.45 వేల చెక్కులు అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో విఫలం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రెబ్బెన: గురుకుల పాఠశాలలు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు హనుమంతరావు ఆరోపించారు. మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈనెల 17న జరగబోయే నిరసన దీక్షలో వివిధ యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు సృజన తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

దహెగాం: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని బీబ్రా గ్రామంలో పంటల నమోదును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల నమోదు చేసుకోవడం వల్ల పంట చేతికి వచ్చిన తర్వాత అమ్ముకోవడానికి ఇబ్బందులు ఉండవన్నారు. గ్రామాల్లో వ్యవసాయాధికారులు వస్తే రైతులు సహకరించాలన్నారు. ఏఈవో వెన్నెల, రైతులు ఉన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో న్యాక్ ద్వారా మహిళలకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందించగా.. శుక్రవారం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ అశోక్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో వసతి గృహాలు

- సౌకర్యాలు కరువు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు


జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే (బాలుర)

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో వసతి గృహాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చన్నీటితో స్నానాలు చేస్తుండడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడం, కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. గదుల్లో లైట్లు లేకపోవడం, పనిచేయని ఫ్యాన్లు, కిటికీలకు తలుపులు లేకుండా పోయాయి.

అద్దె భవనాల్లో అరకొర వసతులు

2017లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున గురుకుల పాఠశాలను ప్రారంభించింది. జిల్లా కేంద్రంలోని సాయిబాబా అలయం ముందు ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో 1 నుంచి 10వ తరగతి వరకు సుమరు 420 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ పక్కా భవనం నిర్మించకపోవడంతో అద్దె భవనాల్లో అరకొర వసతులతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. తరగతి గదే నిద్రించాల్సిన పరిస్థితి. అందులో బ్యాగులు, బకెట్లు, బ్యాంకెట్లు, దుప్పట్లు ఉంచాల్సి వస్తోంది. కనీసం ప్రార్థన కూడా ఆ గదిలోనే చేయాల్సిన దుస్థితి. ఆటలు ఆడుకునేందుకు స్థలం లేదు. నేల పైనే విద్యార్థులు నిద్రిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల బాధను చూసి వేరే స్కూళ్లలో చదివిస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో వసతి గృహాలు కేజీబీవీ 15, మైనార్టీ గురుకులాలు 3, మహాత్మ జ్యోతిబా పూలే 4, సాంఘిక


ఆసిఫాబాద్‌లోని బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు

సంక్షేమ గురుకులాల 5, గిరిజన గురుకులాల 5, ఆశ్రమలు 44 హాస్టళ్లలో సుమారు 35 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి కనీస సౌకర్యాలు మరుగుదొడ్లు, పడుకునే గదుల్లో ఫ్యాన్లు, కిటికీల తలుపులు లేక విద్యార్థులు కష్టాలు పడుతున్నారు. గత విద్యాసంవత్సరంలో వసతి గృహ విద్యార్థులు అనారోగ్యంతో జిల్లాలో నలుగురు చనిపోయిన విషయం తెలిసిందే. జిల్లా కేంద్రంలోని వసతి గృహాల్లో ఇలాంటి పరిస్థితి ఉంటే మండలాల్లో వసతి గృహాల్లో ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవాలి. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదు. నిత్యావసర, కూరగాయల ధరలు ఎక్కువ పెరగడంతో నాణ్యత లేని భోజనం అందిస్తున్నారని సంబంధిత కాంట్రాక్టుపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

త్వరలో కొత్త భవనంలోకి..

ప్రస్తుతం ఉన్న భవనంలో వసతులు లేక విద్యార్థుల ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. కొడవెల్లి సమీపంలో నూతన భవన పనులు కొనసాగుతున్నాయి. ఇవి పూర్తయితే భవనం త్వరలో అందుబాటులోకి వస్తుంది.

– వెంకటప్రసాద్, ప్రిన్సిపాల్

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె


కౌటాల: వర్షంలో సమ్మె చేస్తున్న కార్మికులు


రెబ్బెన: ఎంపీపీ సౌందర్యకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

కౌటాల/కెరమెరి/రెబ్బెన/దహెగాం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ జిల్లాలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ సమ్మె శుక్రవారం నాటికి ఎనిమిదో రోజు చేరింది. కౌటాలలో వర్షంలోనూ కార్మికులు తడుస్తూ సమ్మెలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందించారు. కార్మికుల సమ్మెకు ఎమ్మార్పీఎస్ సంఘం మద్దతు పలికారు. కెరమెరిలో కార్మికులకు సీఐటీయూ మండల కన్వీనర్ ఆనంద్‌రావు సంఘీభావం తెలిపారు. దహెగాం మండల కేంద్రంలో దుకాణ సముదాయాల వద్ద కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. రెబ్బెనలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ


దహెగాంలో భిక్షాటన చేస్తున్న కార్యదర్శులు

వేముర్ల సంతోష్, సర్పంచ్ అహల్యాదేవి, ఎంపీటీసీ మధునయ్యకు వినతిపత్రాలు అందజేశారు. పంచాయతీ కార్మికులకు పీఆర్సీని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కార్మికులు, నాయకులు ఉన్నారు.

వెల్గి ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

వాంకిడి: మండలంలోని వెల్గి ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యసిబ్బంది విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. వసతి గృహంలోని గదులు, పరిసరా ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేశారు. హెచ్‌ఈవో పెందూర్ రవిదాస్, హెచ్‌ఎం మారుతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని నాగేపల్లిలో నూతన పంచాయతీ భవనం నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కొత్త పంచాయతీలను ఏర్పాటు చేశారని తెలిపారు. కొత్తగా ఏర్పడిన జీపీలకు భవనాలు నిర్మిస్తామన్నారు. జీపీ భవనానికి ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా కౌటాల మండలంలోని భాలేపల్లిలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి ఎంపీపీ విశ్వనాథ్ భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ డొంగ్రి అనూష, సర్పంచులు నిహారిక, జాడే కుశబ్‌రావ్, వొజ్జల మౌనిశ్, పార్టీ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావు, మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ఎంపీవో మౌనిక, కార్యదర్శి సంధ్య, నాయకులు మధుకర్, శ్రీనివాస్, సంతోష్, రాంచందర్ పాల్గొన్నారు.


నాగేపల్లిలో జీపీ భవనం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

సమస్యలు పరిష్కరించాలని వినతి

చింతలమానెపల్లి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ఆయనకు కార్మికులు తమ సమస్యలను తెలియజేశారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డోకె రాజన్న, నాయకులు సుధాకర్, నీలాగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బెజ్జూర్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని కుంటలమానపల్లి, సలగుపల్లి, బెజ్జూర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలతోపాటు బెజ్జూర్‌లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 25 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. సలగుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ఆదివాసీలు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కుపత్రాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. సలగుపల్లిలో గిరిజనేతురుల పట్టాల విషయమై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సలగుపల్లి, తదితర గ్రామాల అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. మద్దిగూడెంలో సైడ్ డ్రైన్, ఇళ్ల త్వరలో మంజూరు చేస్తామని హామీ


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చారు. అనంతరం పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాశ్, రైతుబంధు జిల్లా కోఆర్డినేటర్ జగ్గాగౌడ్, ఎంపీటీసీలు లక్ష్మి, పర్వీన్ సుల్తానా, మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, సర్పంచులు హనుమంతు, శేఖర్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సకారాం, యూత్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

రెబ్బెన: జాతీయ రహదారి పనుల్లో భాగంగా డివైడర్ల మధ్య నాటిన కోనోకార్పస్ చెట్లను తొలగించాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. మండల పరిధిలో డివైడర్ల మధ్య నాటిన కోనో కార్పస్ చెట్లను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. కోనోకార్పస్ చెట్లు మానవజాతికి ప్రమాదకారి అని పరిశోధకులు చెబుతున్నారని తెలిపారు. అధికారులు మాత్రం విచ్చలవిడిగా కోనోకార్పస్ మొక్కలు నాటడంతో ప్రజల ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.


డివైడర్ల మధ్యలో కోనోకార్పస్ చెట్లను చూపిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నిరసన దీక్ష విజయవంతం చేయాలి

సిర్పూర్(టి): గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి నిరసన దీక్ష కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకులాల్లో గెస్ట్, పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్ పేర్లతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతనం చెల్లించాలన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

గురుకుల ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌గౌడ్, సంగీత, దీప్తి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పిరోజ్‌ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అంకుసాపూర్ నుంచి మోవాడ్ గ్రామాల వినియోగదారులు గమనించాలని కోరారు.

రైల్వే అండర్‌బ్రిడ్జిల్లో వర్షపు నీరు

- ఇబ్బందుల్లో వాహనదారులు, గ్రామస్తులు
- ఏటా వర్షాకాలంలో తిప్పలు
- పట్టించుకోని అధికారులు


చీలపల్లి రోడ్డులో గల అండర్‌బ్రిడ్జిలో నిలిచిన వర్షపునీరు

సిర్పూర్(టి): మండలంలో ఉన్న రైల్వే అండర్‌బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిలుస్తుండడంతో ప్రయాణికులు, వాహనదారులర ఇక్కట్లు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి చీలపల్లి, ఇటిక్యాల పహాడ్ గ్రామాలకు వెళ్లేదారిలో రెండు రైల్వే అండర్ బ్రిడ్జిల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలుస్తోంది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఓ వైపు సిర్పూర్ నుంచి గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడం, మరోవైపు అండర్‌బ్రిడ్జిల్లో నీరు నిలుస్తుండడంతో గ్రామాల ప్రజలు ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చీలపల్లి, ఇటిక్యాలపహాడ్, పూసిగూడ, లింబుగూడ, రావన్‌పల్లి, మేడిపల్లి, చిన్నమాలిని, మాలిని గ్రామాల ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రతిఏటా వర్షాకాలంలో తిప్పలు పడుతున్నా రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఏటా అదే పరిస్థితి..

రైల్వే గేటును అధికారులు మూసివేసి రోడ్డు వసతిని బంద్ చేశారు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లాలంటే రైల్వే అండర్‌బ్రిడ్జిల గుండానే వెళ్లాల్సి వస్తోంది. గతంలో భారీ వర్షాలకు అండర్‌బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. గ్రామాల ప్రజలు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేయగా మోటారుతో వర్షపు నీటిని తొలగించారు. ప్రతి ఏటా మళ్లీ అదే పరిస్థితి నెలకొంటున్నప్పటికి అధికారులు ఇప్పటి వరకు స్పందించడం లేదు.

రోడ్డు సౌకర్యం కరువు


ఇటిక్యాల పహాడ్ రోడ్డులోని అండర్‌బ్రిడ్జిలో నిలిచిన వర్షపునీరు

ఇటిక్యాల పహాడ్ గ్రామానికి వెళ్లేందుకు, మండల కేంద్రం నుంచి చీలపల్లి వరకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో గ్రామాల ప్రజలు చీలపల్లి వరకు కాలినడకన, సైకిళ్ల ద్వారా చేరుకుంటారు. చీలపల్లి నుంచి ఇతర గ్రామాలకు వాహనాల ద్వారా వెళ్తుంటారు. రోడ్డు సౌకర్యం లేని కారణంగా గ్రామాల్లో వాహనాలు, అంబులెన్సులు రాని పరిస్థితి. దీంతో రోగులు, గ్రామస్తులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అండర్‌బ్రిడ్జిల సమస్య పరిష్కరించడంతోపాటు రోడ్డు సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు


అండర్‌బ్రిడ్జిల్లో వర్షపునీరు నిలుస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. అండర్‌బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి.

– భీంరావ్, పూసిగూడ

ఇబ్బందిగా ఉంది


ప్రతిఏటా వర్షాకాలంలో గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. అండర్‌బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిలుస్తోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

– సుర్పం అర్జు, మాజీ సర్పంచ్, చీలపెల్లి

నిత్యావసరాలు అందజేత

సాక్షి స్పందన

దహెగాం: మండల కేంద్రానికి చెందిన బోరె లస్మయ్య, శోభక్కలు ఇద్దరు పశువుల కాపర్లు. ఈ నిరుపేదలకు ఉండడానికి ఇళ్లు లేక వారు పడుతున్న ఇబ్బందులపై గతనెల 29న ‘తాటికమ్మల గుడిసెలోనే..!’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, దహెగాం ఎస్సై సనత్‌కుమార్‌లు స్పందించి వారికి నిత్యావసర సరుకులతోపాటు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు తోచిన సహాయం చేయాలన్నారు. అదేవిధంగా మండలంలోని పార్వతిపేట గ్రామ యువకులకు వాలీబాల్ కిట్లు అందజేశారు.


బోరె లస్మయ్య కుటుంబానికి సరుకులు అందజేస్తున్న సీఐ, ఎస్సై

సొంత భవనాలు మంజూరు చేయాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భీమేశ్ కోరారు. శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి వినతిపత్రం అందించారు. భీమేశ్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ డివిజన్ కేంద్రంలో బీసీ(ఎస్ఎంఎస్) పోస్ట్ మెట్రిక్ బాలుర, బాలికల వసతిగృహాలకు సొంత భవనాలు మంజూరు చేయించాలన్నారు వసతిగృహాలు మంజూరై పన్నెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. కనీస సౌకర్యాలు లేక అరకొర వసతులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇరుకు గదుల్లోనే ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పద్మశాలి సంఘం ఎన్నికలకు నామినేషన్లు

ఆసిఫాబాద్: ఈనెల 23న పద్మశాలి సంఘం జిల్లా ఎన్నికలు జరగనున్నాయి. జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో శుక్రవారం పలువురు నామినేషన్లు వేశారు. అధ్యక్ష పదవికి ఆసిఫాబాద్‌కు చెందిన ఇరుకుల్ల ఆంజనేయులు, గోలేటికి చెందిన వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శికి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల పరిశీలకుడు అనుమాండ్ల శ్రీకాంత్ తెలిపారు.

చదువుతోనే గుర్తింపు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి ముందుకెళ్లాలని ఉట్నూర్ సివిల్ కోర్టు జడ్జి దుర్గారాణి అన్నారు. శుక్రవారం కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు బాగా చదువుకొని భవిష్యత్‌లో మంచి స్థానంలో ఉండాలన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి దుర్గారాణి